


'ఇన్నాళ్ళకు మా కష్టాలూ, సరోజ కష్టాలూ గట్టెక్కాయి' అన్నారు కామాక్షమ్మగారు కొద్దిగా చలించే కంఠంతో కొడుకు రవికి పులుసు వడ్డిస్తూ.

ఏదో ఆలోచిస్తూ తింటున్న రవి ఉలిక్కిపడి తలెత్తి చూశాడు విచిత్రంగా ఏమీ అర్థంకాక.

రవి ఏదో అడిగేలోపలే రఘు నవ్వుతూ 'అదేలే అన్నయ్యా అమ్మ ఛాదస్తం. సరోజకు సంబంధం నిశ్చయమైంది. అప్పటి నుండీ రేపే పెళ్ళి అన్నట్టు హడావుడి పడుతున్నారు వీళ్ళు. నీకు ఉత్తరం నిన్ననే రాశారు కాని నీవు హఠాత్తుగా వూడిపడ్డావు ఏమీ రాయకుండా;' అన్నాడు గబగబా.

పెద్దగా నవ్వేశాడు రవి. 'అదన్న మాట సంగతి! నే ఉదయం వచ్చినా సాయంత్రం దాకా - దాచిపెట్టుకున్నారేం? ఎక్కడిదీ సంబంధం? ఏవరామనిషి? లాయర్హా డాక్టరా? నాకసలు తెలియనీయ లేదే'...

ఉత్సాహంగా అడుగున్న రవిని నవ్వుతూ మందలించారు కామాక్షమ్మగారు 'ఒక్కొక్కటి అడగరా బాబూ. నీ కాలేజీలో అడిగినట్టడుగుతావేం ఒక్కసారిగా? మొదలైతే భోజనం కానీ చెప్తాను—మనవూరి సంబంధమేలే...వెంకట్రావుగారని గోగారం వూరాయన తెలుసుకదూ, ఆయన రెండవ అబ్బాయిలే.'

రవి తెలీదన్నట్టు మొహం పెట్టాడు.

'వీర వెంకట్రావు ...!! బక్కగా, వంగిపోయి, రమణారెడ్డి కంటే పీక్కుపోయిన మొహం...ఆయనేలే అన్నయ్యా!'

'ఊరికే వాగకు రఘూ పెద్దవాళ్లనట్లాగే అంటారా? నీవు నేర్చుకున్నదింతేనా?' కామాక్షమ్మగారు కోపగించుకున్నారు.

'ఆ రెండవ కొడుకంటే ధర్మారావా?' ఏదో గుర్తుకొచ్చి అడిగాడు రవి ఇదేమీ పట్టించుకోనట్టు.

'కాదు ధర్మారావు పెద్దకొడుకులే. ఇతడు భీమారావు.'

'భీమారావంటే సన్నగావుండి పొట్టి చొక్కాలు వేసుకుంటాడు మెడిసిన్ ఫైనల్ చదువుతున్నాడు...అతడేనా?'

అవునన్నట్టు తలవూపారు కామాక్షమ్మగారు.

రవి దూకుడుగా అడిగాడు 'అయితే అమ్మా! అతడు నాకంటే రెండేళ్లు పెద్ద కదూ? ఇంకా మెడిసిన్ చదువుతున్నాడు. ఆ వీర వెంకట్రావు సంగతి మీకు తెలీదా? ఇంతకంటే గొప్ప సంబంధం తగల్లేదా మీకెక్కడా'—

'ఆ విషయాలతో మనకేంపని బాబూ? కుర్రవాడు బుద్ధిమంతుడు, చదువుకున్నవాడు...అది చాలదా మనకు? సరోజ సంతోషంగా సంసారం చేసుకోగలిగితే అంతకంటే ఎక్కువ ఏం కోరుకుంటాం మనం? ఇక ఆ అబ్బాయి తలితండ్రులు ఎట్లావున్నా అబ్బాయి సరిగ్గావుంటే అన్నీ సర్దుకు పోగలదు. నీకుమాత్రం తెలీదా ఎన్ని సంబంధాలు వెతికింతర్వాత ఇది కుదిరిందో? ఏదో మన అదృష్టం బావుండి ఇది కుదిరింది. మనం చూడాల్సింది అబ్బాయి గుణగణాలూ, చదువూ కాని

అతని పుట్టుపూర్వోత్తరాలూ, ఆస్తి పాస్తులుకాదు. వాళ్ళది కూడా పెద్ద కుటుంబం. నలుగురితో సర్దుకు పోయే నేర్పు సరోజ కుండాలికాని, కలివిడిగా హాయిగా వుండగలదు. ఈ సంబంధానికేం లోటని నీవట్లా మాట్లాడుతున్నావు?'

'వాళ్ళది పెద్దదంటే పెద్దకుటుంబమేం? వో సిటీబస్సుకు సరిపోయే జనాభా కదూ,' అల్లరిగా అన్నాడు రవి! మళ్ళీ చటుక్కున ఏదో స్ఫురించి సూటిగా అడిగాడు 'కట్నమెంత ?'

కామాక్షమ్మగారి మొహంలో కొద్దిగా బాధ స్ఫురించింది. నిట్టూరుస్తూ అన్నారు 'అదే కొద్దిగా ఎక్కువనిపిస్తూంది. కాని ఏం చేస్తాం? ఈ రోజుల్లో అంతా ఆకాశమెక్కి కూర్చుంటున్నారు. అసలు పిల్ల నచ్చటం, సంబంధం కుదరడమే గగనమై పోతున్నప్పుడు కట్నం విషయంలో మడి కట్టుక్కూర్చుంటే ఎట్లా ? పైగా మనకు సరోజ ఒక్కతే ఆడపిల్ల. మీనాన్నగారిపేరూ, ఇల్లూ చూసి ఎవరేనా ఎక్కువ అడుగుతారు'...

అసహనంగా అడిగాడు రవి 'అసలెంతో చెప్పక ఏదేదో...'

'పాతికవేలు, తెలుసా?' కఠినంగా అన్నాడు రఘు.

ఉలిక్కిపడి అపనమ్మకంగా తల్లివేపూ, రఘువేపూ చూసి 'వోహో!' అని ఏదో అనబోయి, ప్రయత్నాన్ని మానుకుని మెల్లిగా తనగదికి వెళ్ళిపోయాడు రవి, బయట సోఫాలో కూర్చున్న పరంధామయ్యగారిని కూడా గమనించకుండా.

శివ, శివా! శారదాచట్టం పవిత్ర భారతభూమిలో అమలుకు వచ్చి పదేళ్ళు దాటిందే! వ్యత్యాసం ఏమిటంటే చట్టం అమలులోకి రాకముందు బహిరంగంగా పీటలమీద కూర్చున్నప్పుడే లెక్క చూసుకు తీసుకునేవారు. ఇప్పుడు సభ్యత అడ్డువచ్చి మొదలే కట్నంలాగి ఆతర్వాత శుభకార్యాన్ని (పెళ్ళి) జరిపిస్తున్నారు. ఆవిధంగా చూస్తే చట్టం లేకముందే నయమనిపిస్తూంది.

వరకట్నం మన సాంఘిక వ్యవస్థకు ఒక విధంగా మంచిదే. పాశ్చాత్య వ్యవస్థలో కనిపించే యువతీయువకుల వివాహానికి ముందు అవాంఛనీయమైన సంబంధాలను దాదాపు పూర్తిగా అరికట్టే శక్తి వరకట్నానికి వుంది. అయినా వరకట్నం పేరుమీద పశువుల బేరం సాగించడం కన్నెల భవిష్యత్తుతో చెలగాటమాడటం. కూతురు పెళ్ళికి పాతిక వేలిచ్చి కొడుకు పెళ్ళికి అంతకు రెట్టింపు రాబట్టుకునే ఆలోచనెవ్వరూ సమర్థించలేరు. ఈ విషయాలతో పోలిస్తే వరకట్నాచారంలేని పాశ్చాత్య సాంఘిక వ్యవస్థలోని దుష్ఫలితాలు అతి స్వల్పం అనిపిస్తాయి.

గదిలో ఏదో పత్రిక తిరగేస్తూ ఆలోచిస్తూ కూర్చున్నాడు రవి. రవి ఉద్యోగం చేస్తుంది ఢిల్లీ ఇంజనీరింగు కాలేజీలో లెక్చరరుగా. ఇరవై అయిదేళ్ళుకూడా నిండని రవి తిరిగినన్ని వూళ్ళూ, చూసిన ప్రదేశాలు మూడు పాతికలు నిండిన వాళ్ళు కూడా చూసి వుండరు. ప్రస్తుతం రవి వరంగల్లు కాలేజీలో ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వచ్చాడు. ఢిల్లీకి వెళ్ళి ఏడాదిపైనే అయినా హైద్రాబాదులోని వాళ్ళింటికి రావడం ఇదే మొదటిసారి. అందుకే పదిరోజుల లీవు తీసుకుని మరీ వచ్చాడు.

పరంధామయ్యగారు హైద్రాబాదులో పేరుమోసిన లాయరు. ఎంతో నిక్కచ్చి మనిషి. గంభీరంగా వున్నా అందరితో కలివిడిగా మాట్లాడుతారు. తొందరపాటు మనిషి, ఓర్పు తక్కువ. కొడుకులను మాత్రం దూరంగా వుంచుతారు. అదే క్రమశిక్షణ అంటారు. ఈమధ్య ప్రాక్టీసు బాగా పుంజుకుని వో రెండేళ్ళకిందే కొత్త కారు కొన్నారు. ఆయిన పెద్దబ్బాయి రవి, తర్వాత కూతురు సరోజ, ఆతర్వాత రఘు.

అందరు తండ్రుల్లాగే పరంధామయ్యగారికి కూతురు వివాహం వో పెద్ద సమస్య అయి కూర్చుంది. అందం, చదువు అన్నీ వున్నా సరోజలో వున్న ఘోరమైన లోపం—చామనఛాయ. ఆకర్షణీయమైన కళ్ళూ సన్నగా పొడూగ్గా వుండే ఆ లావణ్యమయికి కన్నెచెర తొలగడానికి చామనఛాయ ఎవరూ అనుకోనంత పెద్ద ప్రతిబంధకంగా తయారైంది.

ఇప్పటి యువకుల దృక్పథం ఎంతో విచిత్రమైంది. ఉన్నత శిఖరాలనందుకోవాలనే ఆశయం ఎంత వాంఛనీయమైనదైనా, తమ తమ యోగ్యత, శక్తిప్రయత్నాలనుబట్టే ముందుపోకుగలరు ఎవరేనా. కాని ఇప్పటి తరం వారి ఆలోచనల్లో ఇవేవీ కన్పించవు. స్వప్నజగత్తులోనే విహరిస్తారు. గొంతెమ్మ కోరికలతో కడుపు నింపుకుంటారు.

ప్రతి యువకుడూ తనకు సోఫియా లోరెన్ అంత అందమైన భార్యా, ఫోర్డంతా ధనికుడైన మామగారు కావాలంటాడు; కాని అంత యోగ్యమైన కన్నెకు తను తగునా కాదా అని ఆలోచించడు. తాను కాకిలా వున్నా దొండ పండులాంటి యువతి కోసం అర్రులు చాస్తాడు. చదువుకున్న అమ్మాయిని కోరుకుంటాడే కాని తనకు లొంగి వుండాలంటాడు. సంగీత నాట్య విశారద కావాలంటాడేకాని పెళ్ళి తర్వాత అన్నీ మరిచిపోవాలంటాడు. ధనికురాలైనా సరే తనకు విధేయురాలై వుండి సేవలు చేయాలంటాడు. సర్వాంగ సుందరి కోసం కలలు కంటాడే కాని ఆ లేమను ఇతరులు కానీ, ఇతరులను ఆ కొమ్మ కానీ కన్నెత్తి చూడ్డాన్ని సహించలేడు.

పరంధామయ్యగారు రెండేళ్లను బట్టీ కూతురు కోసం సంబంధాలు వెదుకుతున్నాడు. హైందవ సాంప్రదాయాలను తు. చ. తప్పకుండా పాటించే మనిషి వారు. మన సాంప్రదాయాలన్ను బట్టి మొదలు అమ్మాయి తండ్రి కాబోయే వరుని తండ్రితో మాట్లాడాలి. అంటే కట్నం ఇంతని ఖచిత్యంగా బేరం చేసుకోవాలి. ఆ తర్వాత అబ్బాయ్. తదితరులు అమ్మాయి తండ్రి ఇంటపైనపడి నానా హంగామా చేసి పోతారు. సరోజ విషయంలో ఇది చాలా సార్లు జరిగింది.

వీరవెంకట్రావు ఏదో పనిమీద పరంధామయ్యగారిని కలుసుకుని నెమ్మదిగా అసలు విషయం చెప్పి సరోజను కూడా చూచి, కట్నం విషయం తేల్చుకుని వెళ్ళాడు. ముప్పైవేలు అడిగాడు కానీ మధ్యవర్తుల మొహమాటంమీద పరంధామయ్యగారిపై దయతల్చి పాతిక కొప్పుకుని కొడుకును తెచ్చి చూపించి తల వూపించాడు 'కొద్దిగా నలుపైతేనేం? మహాలక్ష్మి నలుపుకాదూ?' అనుకున్నాడేమో!

వీరవెంకట్రావు పెద్దగా వున్నవాడేం కాదు. రెండెకరాల పొలం, తరాలనాటి ఇల్లూ అతని స్థిరాస్తులైతే, తొమ్మిది మంది కొడుకులూ, ఏడుగురు కూతుళ్ళూ అతని చరాస్తులు. ధర్మారావు, భీమారావు... అని మొదటి ఐదుగురు పుత్రరత్నాలకు

పేర్లు పెట్టి ఇంకా పుట్టుకొస్తారేమో రామా లక్ష్మి, లక్ష్మి, మరావు, అని మిగిలిన నలుగురికీ పేర్లు పెట్టాడు. కాని పూలతోపాటే ముళ్ళు కూడా పుట్టుకొస్తాయి. పాపం! ఏడుగురు కూతుళ్ళనుకూడా కన్నది ఆయన ధర్మపత్ని. ప్రతి అబ్బాయి తండ్రిలాగే వీర వెంకట్రావుదికూడా అమోఘమైన బుర్ర. బేరం సరిగ్గా చేసుకుంటే కొడుక్కి ఇరవై వేలు రాల్తాయని ఆయన ఆశ. ఒక్కో కూతురికి ఐదువేలచొప్పున గడిపేస్తే— అమ్మో! ఎంతలాభం! ఎంతలాభం! వయసు వచ్చిన ముగ్గురు పెద్దకూతుళ్లకూ ఏదో పెళ్ళిళ్ళయిందని పించాడు. ఆ తర్వాత బి. ఏ. చదివిన పెద్దకొడుకును బేరం పెట్టాడు. ఆ వచ్చిన పదివేలూ పట్టుకుని రెండవ కొడుకును మెడిసిన్‌లో చేర్పించి నాకొడుకు ఖరీదు ముప్ఫైవేలు అని చెప్పుకోసాగాడు. దాంతో కాబోయే కన్యాదాతలు హడలుకుని ఆయన గడపకూడా తొక్కలేదు. దాంతో ఆయనే యాత్ర మొదలుపెట్టి పరంధామయ్యగారిని పట్టుకోగలిగాడు.

రవికివన్నీ తెలిసి మతిపోయింది. తండ్రితో ఏమీ అనలేదు. ఇన్నాళ్లకు కుదిరిన సంబంధం వదులుకుంటారా? పైగా తండ్రి దగ్గర ఏమాత్రం చొరవ లేదు. అందుకనే తల్లిదగ్గరచేరి మెల్లిగా అడిగాడు, ఇంటర్వ్యూనుండి వచ్చింతర్వాత.

'అమ్మా, ఇప్పుడీ పాతికవేలూ, పెళ్ళి ఖర్చులూ ఎక్కడినుంచి తేగలం. అయినా ఇంతకట్నం మనదగ్గర ఎవ్వరూ ఇచ్చుకోరే? రేపు బాబాయి తన కూతుళ్లకు ఇవ్వగలడా ఇంతేసి కట్నాలు?'

'ఏం బాబూ ? అలా అడుగుతావు ? ఏదోవిధంగా సర్దుకోగలంలే, అయినా మనకు లోటేమిటి? ఏడాది తిరక్కుండా మనకు ఇంతకు రెండురెట్లు కట్నం రాదేమిటి? ఆతరవాత రఘుకు...'

'అది కాదమ్మా వాళ్ళది అంత పెద్ద కుటుంబంకదా, నీ ముద్దులకూతురు అందరితో సర్దుకు పోగలదా ?'

'సర్దుకుపోక ఏం చేస్తుందీ? అయినా ఆడపిల్ల కామాత్రం లేక పోతే...'

'సరేలే, ఏమేనా అంటే ఎదో చదువు కొస్తావు....సరేకాని మొన్న నే ఇంటర్వ్యూకు వరంగల్లుకు పోయినప్పుడు రంగారావు మామయ్య వచ్చాట్టగా, ఏమన్నాడేంటి?'

# నిన్న-నేడు-రేపు

దెబ్బతిన్నట్టు ఉలిక్కిపడ్డారు కామాక్షమ్మగారు. 'ఏం రఘు చెప్పాడా నీకు? ఏముంది అనేందుకు ఆయన కూతురును నీకు చేసుకోవాలిట. ఏం చూసి చేసుకుంటాం? ఆయన కింటినిండా గంపెడు పిల్లలు, ఆస్తిపాస్తులు సున్నా, ఏదో కాస్త తెల్లగావుండి, చదూకోగానే సరా? చిన్నప్పటినుండి అనుకున్న సంబంధమని ఒకటే గోల. ఏవరనుకుంటే మాకేం? మాకు వద్దని ఖచ్చితంగా చెప్పాను. ఇంతలేసి కట్నాలుపోసి మనపిల్ల పెళ్లిచేసి, ఈ ముష్టి సంబంధం చేసుకోవడానికేం మనం పిచ్చాళ్లమనుకున్నాడేమో మరి. అయినా మనమింత కట్నమిస్తున్న సంగతి తెలిసీ ఏ మొహం పెట్టుకుని మనింటికొచ్చాడో!'

రవి భృకుటి ముడివేసి కొద్ది చిరాకుతో, కోపంగా అన్నాడు, 'ఏంటమ్మా, లతకేం తక్కువైందని నీవు అంత గట్టిగా చెప్పి పంపించి వేశావు? చెల్లాయికేదో ఆ గొప్ప మనిషి మొహాన కుమ్మరిస్తే మనంకూడా ఇక పశువుల బేరం మొదలుపెడదామా? మన ఖర్మ కొద్దీ ఇవ్వగలిగినా లేకపోయినా రక్తంతోబాటు కూడపెట్టిన డబ్బంతా వాళ్లకు పోయవలసివస్తే మనం రేపు ఇంకొకళ్ళ రక్తం తాగాలా? మనకు ఒక్కతే ఆడపిల్ల గనక సరిపోయింది, నలుగురు ఆడపిల్లలున్న మామయ్య ఎట్లా భరించగలడు? ఆయనకేం మగపిల్లలు లేరు కదా, లతకు ఇచ్చిన కట్నం మళ్లీ రాబట్టుకోవడానికి?'

యుక్తియుతంగా చెప్పుకొచ్చాడు రవి.

కొడుకు మాటలకు నిర్ఘాంతపోయారు కామాక్షమ్మగారు. 'నీవా లతనే చేసుకోవాలని వ్రతం పట్టావా? పీటలమీద పెళ్లిళ్ళే చెడిపోతున్న ఈరోజుల్లో, ఏదో చిన్నప్పుడనుకుంటే చేసుకోవాలని ఎక్కడుంది? నీకా రంగారావుమీదా, లతమ్మమీదా అంత జాలి ఎందుకు? మనమింత కట్నమిస్తున్నామని ఎవరేనా జాలిపడుతున్నారా ఏం? రేపు కొడుకులకింతకు పదిరెట్లు వస్తుంది అంటున్నారంతా. నాకేం తెలీదు. మీ నాన్నగారి నడుగు.'

రవి బలహీనంగా నవ్వుకుని వెళ్ళిపోయాడు. ఆతర్వాత కొద్దిరోజులకే వరంగల్లులో జాయినయ్యాడు.

రవి చెల్లెలి పెళ్ళి బ్రహ్మాండంగా అంతా హోహో! అనేట్టుగా జరిగింది. ఆ నాలుగు రోజులూ డబ్బు మంచినీళ్ళక్రింద ప్రవహించినా పరంధామయ్యగారు ఏం లెక్కచేసినట్టు కనిపించలేదు. రవి ఇంజనీరింగు హృదయం బాధగా మూల్గినా పెళ్ళి సందట్లో ఎవరికీ వినిపించలేదు.

ఏటొచ్చీ వియ్యాలవారు (దయ్యాలవారు అని రఘు అల్లరిగా అనేవాడు) చేసిన హంగామా, అలకలు, టెక్కులతో ఎక్కడా విరామంలేకుండా చాకిరి చేసుకోవలసి వచ్చింది. బస్సుల్లో తిరగడానికి గతిలేని దయ్యాలవారందరూ టాక్సీలు, కార్లలో తప్ప కాలు పెట్టలేకపోవటం; కూటికి కూడా గతిలేని పెద్దమనుష్యులందరూ మిఠాయీల రకాలు ఎక్కువగా లేవనీ, లడ్డూలు గోళీకాయలంత వున్నాయని వంకలు పెట్టడం, రవికీ, రఘుకూ విచిత్రంగా తోచింది. వీలయినంతవరకూ దోచుకు పోదామనే దయ్యాలవారి మనస్తత్వం వాళ్ల ప్రతి కదలికలో కనిపించేది. ప్రతిపెళ్ళిలోనూ వుంటాయి ఈ తద్దినాలు అని రవి తెలుసుకున్నా వీటిని ఆమోదించలేక పోయాడు. తండ్రితో గట్టిగా చెప్పలేదు, చెప్పినా తండ్రి దాన్ని తోసివేసి ఆకోపంతో రఘును నలుగురి ఎదటా తిట్టడం బాధనిపించింది.

చివరి దెబ్బగా అలకపాన్పుమీద అల్లుడు స్కూటరు కోరుకున్నాడు. ఈ విధంగా వీరవెంకట్రావు తన కొడుకు ఖరీదు ముప్పైవేలు, ఆడబిడ్డల కట్నాలతో కలుపుకుని పూర్తిగా రాబట్టుకున్నాడు. ఆ పీక్కుపోయిన మొహంలో ప్రపంచాన్ని గెలిచినంత ధీమా ఏదో నిర్వాణం పొందినంత ఆనందం అందరికీ కనిపించాయి.

వియ్యంకునిపైన దయతలిచి వీరవెంకట్రావు తన కొడుకు మిగతా చదువు మామగారి ఇంట్లోనే వుండి పూర్తి చేసుకోవడానికి అంగీకరించాడు.

* * *

కొద్దిరోజుల తర్వాత పరంధామయ్యగారు రవిని కదిలించారు. 'పెళ్ళిలో చూశావు కదా ఛీఫ్ ఇంజనీరు శర్మగారి అమ్మాయి స్వర్ణలతను—శర్మగారు ఒకటే తొందర పడుతున్నారు. ఓసారి వాళ్ళింటికెళ్ళి చూసి వద్దాం, కావాలంటే.'

తని నిర్లిప్తంగా అడిగాడు 'కట్నమెంత కావాలి?'

'నలభై వేలిస్తా' మన్నాడు — ఆ విషయాలు నే మాట్లాడుకుంటాగాని నీకు వచ్చిందా లేదా చెప్పు.'

ఆడపిల్లంటే ఇప్పటికీ బొమ్మలాగే కనిపిస్తోంది మనవాళ్ళకు. ఆడపిల్ల నచ్చాలికాని ఆడపిల్ల అభిప్రాయంతో పని లేదు. తనను చూసి, పరీక్షించి, చచ్చు ప్రశ్నలువేసి, ఇకిలిస్తూ కాఫీతాగి 'నచ్చింది నాకీ అమ్మాయి' అన్న మొదటివాడిని చేసుకోవాలి. ఆ మహాపురుషునికి కన్యతో పాటు కట్నమూ దండిగా సమర్పించుకోవాలి.

# నిన్న-నేడు-రేపు

ఎంత పెద్ద చదువు చదివినవాడైతే అంత ఎక్కువ కట్నమిచ్చుకోవాలి. ఈ పరిస్థితుల్లో మనం విద్యవల్ల సంస్కారం వస్తుందనే అభిప్రాయానికి స్వస్తి చెప్పాలి.

రవి తీవ్రంగా ఆలోచించాడు. స్వర్ణలత నిజంగా బంగారు తీగలా వుంటుంది. పొడుగాటి జడతో, సన్నగా, ఆకర్షణీయమైన మొహమూ, నిండైన విగ్రహం—కట్నానికి కూడా ఏం లోటులేదు. చెల్లాయి పెళ్ళికని అమ్మేసిన కొత్తకారు జ్ఞాపకం వచ్చింది రవికి అప్రయత్నంగా. మళ్ళీ కారు కొనుక్కోవచ్చు. చెల్లాయి పెళ్ళికి ఇంట్లో తాతగారి వెండి చెంబుతోసహా వెండి పాత్రలన్నీ ఖాళీ అయ్యాయి. అమ్మ మెడలో నగలు తప్ప మిగతావన్నీ చెడగొట్టి చెల్లాయికి చేయించి తద్వారా వెంకట్రావుకు సమర్పించుకున్నారు. కాని...

చిన్నప్పటినుండీ తననే అమాయకంగా ఆరాధించే లత; అందానికీ, తెలివికీ ఎవరికీ తీసిపోని రెమ్మ; ఆటల్లో తనెంత ఏడిపించినా, అల్లరిపెట్టినా తన జట్టే వుండే బేల; ఆత్మ సౌందర్యం తప్ప ఇంకేం ఇచ్చుకోలేదు. రక్తం పంచిచ్చిన తండ్రి, ఏలోటూ రాకుండా శిక్షణ ఇచ్చిన పూజ్యులు తన ఔన్నత్యానికి కారణభూతులు, అయినా పరిస్థితుల ప్రాబల్యంవల్ల తప్పటడుగు వేసి ఒకళ్ళ దాహం తీరిస్తే, వీటన్నిటికీ బహుమతిగా తాను ధన స్వాతంత్ర్యంవున్న ఒకే ఒక్క కారణంవల్ల వారిని ధిక్కరించి తన కిష్టమైన అమ్మాయిని పెళ్ళాడాలా? ఇప్పుడు ఆయనతో వాదులాడి ఒప్పించడం తన శక్తికి మించిన పని. అవును — మనం కట్నం ఇచ్చినప్పుడు తీసుకోమని మడి కట్టుకుని ఎట్లా కూర్చుంటాం? కాని రెండు తప్పులు ఎప్పుడూ ఒక ఒప్పు కావు.

తండ్రి తన రక్తమే కొడుకు శరీరంలో ప్రవహిస్తుందనీ, అది వేడిగా ఉందనే విషయాన్ని విస్మరిస్తాడో, లేక కొడుకులో తన ప్రతిబింబాన్ని చూసి వెరుస్తాడో తార్కికుని వూహకు కూడా అందదు. నిజానికి మనందరిలో తెలివైనవాడు దర్జీ ఒక్కడే. మనం వెళ్ళినప్పుడెల్లా మనకొలతలు మళ్ళీ తీసుకుంటాడు. మిగిలినవాళ్ళంతా మన పాతకొలతలు పట్టుకొనివుంటారు; పైగా మనం వాటికి సరిపోవాలంటారు. పరంధామయ్యగారు కూడా అంతే. తన కొడుకులు ఎదిగి వ్యక్తిత్వాన్ని సంపాదించుకున్నారనే విషయాన్ని ఏమాత్రం తెలుసుకోలేక పోయారు.

* * *

ఆ తర్వాత కొద్ది నెల్లకే రవి పెళ్ళైంది. సలాహారోజా పెళ్ళి అనీ, వరంగల్లులో జరుగునని అందరికీ శుభలేఖలు వెళ్ళాయి. పెళ్ళికూతురు పేరు జ్యోతిర్లత.


గాయాలా!
వెంటనే, వేయండి
బర్నాల్
చల్లని, చమ్మని మందు




చల్లని చమ్మని బర్నాల్ కాల్పులు, కోతలు, పగుళ్ళకు, కురుపులకు మరియు గాయాలకు సర్వ ప్రయోజనకారియైన మందు. బర్నాల్ త్వరగా నయంచేసి, సూక్ష్మ క్రిములను బలవంతంగా నిర్మూలిస్తుంది. బర్నాల్ మంట పెట్టదు. అది చల్లగా, చమ్మగా ఉంటుంది...పగిలిన చర్మాన్ని సరిచేయటంలో ప్రకృతికి తోడ్పడుతుంది.

బర్నాల్ 40 సంవత్సరాలకు పైగా అసంఖ్యాక గృహాలలో విశ్వసనీయమైన నివారిణి.

Boots బూట్స్ ప్యూర్ డ్రగ్ కంపెని (ఇండియా) లిమిటెడ్

ASP/B/B-13A